అవి భారత దేశాన్ని కంపెనీ వాళ్లు పరిపాలిస్తున్న రోజులు; మశూచికాది వ్యాధులకు భారతీయ వైద్యులు ఇస్తున్న సూది మందు విధానం అర్థంకాక, కంపెనీ వాళ్ళు ఆ విధానాన్ని బహిష్కరించిన రోజులు; ఉన్న వైద్యం బహిష్కరింపబడి, కంపెనీ వాళ్లు చేసే సరైన వైద్యం లేక దేశం అల్లాడుతున్న రోజులు; చివరికి మిగిలిన వేపమండలతోనే ప్రజలు అవస్థపడుతున్న రోజులు; అకాల మరణాలకు తట్టుకోలేక జనం అంతా గ్రామ దేవతలను కొలుస్తున్న రోజులు.

అలాంటి రోజుల్లో ఒక రోజున, వందన గ్రామంలో కూడా మశూచికం, ఆటలమ్మ సోకినాయి. ఒక్కొక్క యింట్లో ఐదారేసి మంచాలు, పిల్లల ఏడుపులు, పెద్దల ఏడుపులు. మశూచికం పెద్దమ్మవారు, ఆటలమ్మ పొంగులు లాటివి చిన్నమ్మ వారు అయినాయి. ఊరంతా పొలిమేరలో వున్న గంగానమ్మ గుడికి వెళ్ళారు.

కోడినిస్తామని ఒకరు, మేకనిస్తామని ఒకరు, గొర్రె నిస్తామని ఒకరు, దున్న నిస్తామని ఒకరు ఇలా రక రకాలుగా మొక్కుకున్నారు. కొందరు ఇళ్లల్లోనే వద్ది నైవేద్యాలు మొక్కుకున్నారు.

ఆయు ర్దాయం వున్న వాళ్లకు తగ్గుతోంది, లేని వాళ్లు వెళ్లిపోతున్నారు. గంగానమ్మ గుడిదగ్గర గణాచారి ఊగిపోతూ, "ఎఱుపు, ఎఱుపు" అని అరుస్తున్నాడు. కోళ్ళు, మేకలు, గొర్రెలు, దున్నలు ఎగిరిపోతున్నాయి. రక్తం మడుగులు కట్టసాగింది. అమ్మవారి ప్రాణానికి ఏదో ఒక ప్రాణి కావాలా? మనుష్యులైతేనేమి, జంతువులైతేనేమి ఏదో ఒక ప్రాణి హరీమంటే గాని, మహామారి శాంతించదా?... ఏమో! ఎవడికి తెలుసు?...

పూర్ణప్రజ్ఞావధానిగారు గొప్ప శ్రీవిద్యోపాసకుడు, వేదవేదాంగవేత్త, భాష్యాంత వైయ్యాకరణి, షడ్దర్శనాచార్యుడు "ఆయనకి అమ్మవారు పిలిస్తే పలుకుతుంది" అనేది వందన గ్రామం చుట్టుపట్ల నానుడి.

ఆయన కొక్కడే కొడుకు. హఠాత్తుగా వాడికి కూడా పెద్దమ్మవారు పొడసూపింది. తెలిసిన వైద్యం చేయిస్తున్నాడు అవధాన్లుగారు. ఇంట్లో అందరికీ గాభరాగా వుంది. ఒక రోజు రాత్రివేళ పిల్లవాడికి చాలా తీవ్రమయింది. ఎవ్వరికీ నిద్రలు లేవు. మనస్సు పరిపరి విధాల పోయిన అవధాన్లుగారు ఏమీ తోచక, అలా కాలవగట్టు వెంబడి నడవసాగాడు. నడుస్తూ గంగానమ్మ గుడి దగ్గరికి వచ్చేటప్పటికి, కాళ్లు పీకి, నడవలేక అరుగు మీద కూలబడ్డాడు. ఆ ప్రదేశం అంతా రక్తసిక్తమై వుండి, అవధాన్లుగారికి భరించరాని జుగుప్సకలిగింది. గంగానమ్మకేసి చూశాడు. పాదాల దగ్గరవున్న దీపారాధన వెలుతురు ముఖం మీద పడి, అమ్మవారి మూర్తి భయంకరంగా కనబడింది. "శ్రీమాతా, శ్రీ మహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరీ, దగ్నికుండ సంభూతా, దేవకార్య సముద్యతా" అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు అవధానిగారు. ఒక్క క్షణం ఏదో మగతలాంటిది ఆవరించింది. ఆ మగతలో గంగానమ్మ కనబడింది. "ఏమయ్యా పండితుడా! నువ్వా నాదగ్గరకే వచ్చావా?" అని అడిగింది.

"తల్లీ! నువు దేవతవి, నేను మానవుడిని. నీ దగ్గరికి లాక్కొచ్చావు నన్ను!" అన్నాడు.




"ఐతే, నీ కొడుక్కి తగ్గితే నాకు ఎఱుపుయిస్తావా?" అనడిగింది గంగానమ్మ.

ఉలిక్కిపడి కళ్లుతెరిచాడు అవధానిగారు. గంగానమ్మ విగ్రహం యింకా అదే ప్రశ్న అడుగుతున్నట్టు వుంది. అవధానిగారికి కళ్లు తిరిగినట్టయి, ఏమీ తోచక, "సరేలే! చూద్దాం" అని నీరసంగా యింటి దారి పట్టాడు.

మర్నాటికి తగ్గుముఖం పట్టింది పిల్లవాడికి. వారం తిరిగేటప్పటికి పిల్లవాడులేచి, స్నానంచేసి ఆడుకోసాగాడు. ఇంట్లో సోమిదేవమ్మగారు వద్ది నైవేద్యం పెట్టింది.

జపంలో కూర్చోబోతున్న అవధానిగారికి కళ్లకెదురుగా గంగానమ్మ కనబడింది. "సరే. చూద్దాం అన్న పండితుడివి, నా ఎఱుపు సంగతి ఏం చేశావ్? మర్చిపోయావా?" అని తీవ్రంగా అడిగింది. నిశ్చలంగా ఆవిడకేసి చూశాడు అవధానిగారు. గంగానమ్మ అదృశ్యమైపోయింది.

వెంటనే లేచాడు అవధానిగారు. సంచీ తీసుకుని బయలుదేరాడు. గంగానమ్మ గుడిదగ్గరికి వెళ్ళాడు. "తల్లీ! నీకు ఎఱుపు కావాలి గదా!" అని అడిగాడు. అవునన్నట్టుగా చూసింది గంగానమ్మ.

సంచీలో చెయ్యిపెట్టాడు అవధానిగారు.

"తల్లీ! యదన్నావై మానవాః తదన్నావై దేవతాః
యద్భాషావై మానవాః తద్భాషావై దేవతాః

"అంటే మనిషి ఆహార మేమిటో, వాడి దేవతల ఆహారమూ అదే! వాడి భాష ఏదో వాడి దేవతల భాష అదే అని కదా! ఇంతవరకూ నీకు కానుక లిచ్చుకున్న వాళ్లు, వాళ్ళకి అలవాటయినవి వాళ్ళు యిచ్చారు. అలాగే నాకు అలవాటయినది నేను యిస్తున్నాను. ఎఱుపు కావాలన్నావ్ గదా! ఇదీ ఎఱుపే! తీసుకో" అని —

ఎర్రచీర, రవికల గుడ్డ, ఎర్రని గాజులు, కుంకుమ, మందార పువ్వులు అమ్మవారి పాదాల ముందువుంచాడు.

గంగానమ్మ తల్లి నవ్వుతూ వుండిపోయింది.